
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 2 : జూన్ : 2025



నేటి నుంచి ఇంటర్ తరగతులు

2025-26 విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాలలు సోమవారం ప్రారంభం కానుండగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



ఏదీ కారుణ్యం?

విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగ, కార్మికులు మరణిస్తే కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల్లో జాప్యం జరుగుతోంది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. సాయంత్రం వరకూ వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు అన్నప్రాశన వేడుకలు జరిపించారు. పూజా కార్యక్రమాల్లో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎస్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఫైబర్ గడలు



రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట : పామాయిల్ గెలల కోతకు వినియోగించే ఫైబర్ గడలను ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై అందజేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని గండుగులపల్లిలోని తన నివాసంలో పలువురు రైతులు కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎత్తయిన పామాయిల్ చెట్ల గెలలు కోసే క్రమంలో విద్యుత్ షాక్ తగలకుండా ఫైబర్ గడలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

21 మంది పోలీసులకు సేవా పతకాలు

కొత్తగూడెంఅర్బన్: పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా పతకాలకు ఎంపిక చేసింది. వివిధ కేటగిరీల్లో పతకాలను ప్రకటించగా, జిల్లా నుంచి కఠిన సేవా పతకం విభాగంలో ఆర్ఐలు షేక్ లాల్‌బాబు, గుండాల సీఐ ఎల్.రవీందర్, చర్ల పీఎస్‌కు చెందిన జి.సైదులు, పి.సుమన్, కరకగూడెం స్పెషల్ పార్టీ పోలీసులు బాణోత్ బాలాజీ, వీరబాబు, కె.దిలీప్, డి.నగేష్ ఉన్నారు. సేవా పతకం దక్కిన వారిలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఎస్.మల్లయ్యస్వామి, చంద్రుగొండ ఏఎస్సై ఎస్.పాపయ్య, డీఎస్‌బీ ఏఎస్సై టి.ప్రసాద్ రావు, ఆళ్లపల్లి ఏఎస్సై ఎం.వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏఎస్సై సయ్యద్ రఫీ అహ్మద్, పాల్వంచకు చెందిన కె.కస్తూరి, కొత్తగూడెం వన్ టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ టి.బాలరామరాజు, టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.వెంకటేశ్వర్లు, ఆళ్లపల్లి హెడ్ కానిస్టేబుల్ ఎం.కృష్ణమూర్తి, డీఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.చాంద్ ఉన్నారు. వీరికి నేడు కొత్తగూడెంలో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు పతకాలు అందజేయనున్నారు.

నిత్యావసరాల సరఫరాకు టెండర్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, హాస్టళ్లకు అవసరమైన కోడిగుడ్లు, కూరగాయలు, అరటి పండ్లతో పాటు చికెన్(స్కిన్‌లెస్) సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేల డీడీ చెల్లించి టెండర్ ఫారం తీసుకోవాలని సూచించారు. ఆపై కూరగాయలకు రూ.50 వేలు, పండ్లకు రూ.50 వేలు, కోడిగుడ్లకు రూ.50 వేలు, స్కిన్‌లెస్ చికెన్‌కు రూ.50 వేల చొప్పున ధరావత్తు డీడీ రూపంలో చెల్లించి ఈనెల 9వ తేదీలోగా టెండర్లు సమర్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తులో 20శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, పాన్, టిన్ నంబర్లు, సొంత దుకాణం, బ్యాంకు ఖాతా కలిగిన జిల్లా వాసులు అర్హులని పీఓ తెలిపారు.

భారజల కర్మాగారం జీఎంగా శ్రీనివాసరావు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం జీఎంగా ఘంటసాల శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జీఎం హెచ్.కె.శర్మ ఉద్యోగ విరమణ పొందగా డీజీఎంగా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించింది.

అవతరణ.. అలంకరణ..



విద్యుద్దీపాలతో వెలుగొందుతున్న కలెక్టరేట్

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు

రాష్ట్ర అవతరణ వేడుకలు సోమవారం అట్టహాసంగా జరగనుండగా.. పలు ప్రభుత్వ కార్యాలయాలు, మైదానాలు ముస్తాబయ్యాయి. కొత్తగూడెం – పాల్వంచ మధ్యనున్న జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) రంగురంగుల వెలుగులతో శోభాయమానంగా కాంతులీనుతోంది. ప్రధాన రహదారిపై మిరుమిట్లు గొల్పుతున్న ఈ కార్యాలయం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక సింగరేణి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించే కొత్తగూడెం ప్రకాశం స్టేడియాన్ని కూడా సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. సంస్థ ప్రధాన కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సింగరేణి సాధించిన అభివృద్ధిని వివరిస్తూ పలు స్టాళ్లు ఏర్పాటు చేశారు. కాగా, సీఎండీ ఎన్.బలరామ్ వేడుకలకు హాజరై ఉత్తమ కార్మికులను సన్మానించనున్నారు.

– సూపర్‌బజార్(కొత్తగూడెం)/సింగరేణి(కొత్తగూడెం)



విద్యుత్ దీపాలతో అలంకరించిన సింగరేణి ప్రధాన కార్యాలయం



ముస్తాబైన ప్రకాశం స్టేడియం

మునగతో ముందుకు..



జూలూరుపాడు మండలంలో సాగు చేసిన మునగ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్ (ఫైల్)

రైతులకు లాభసాటిగా పంట

- జిల్లాలో 403 ఎకరాల విస్తీర్ణంలో సాగు
- ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న పంట ఫలాలు

జూలూరుపాడు: పత్తి, మిరప సాగుతో నష్టాల బారిన పడుతున్న రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా మునగకాయలకు డిమాండ్ పెరగడంతో ఈ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మునగ సాగును ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు కూడా ఈ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

120 రోజుల్లో కాత

2023 – 2024 సంవత్సరంలో జిల్లాలోని 312 మంది రైతులు 403 ఎకరాల విస్తీర్ణంలో మునగ సాగు చేశారు. వారు ఇప్పటికే ఫలసాయం పొందుతున్నారు. మునగ మొక్కలు నాటిన 120 నుంచి 150 రోజుల్లోనే కాతకు వస్తున్నాయి. ఈ కాయలను ఆహారంగా వినియోగించడంతో పాటు ఆకులు సైతం ఔషధంగా పనిచేస్తున్నాయి. కాయలను ఎండబెట్టి విత్తనాలతో నూనె తయారు చేస్తారు. మునగ నూనెకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది.

ఉచితంగా మొక్కలు..

ప్రభుత్వం రైతులకు ఉచితంగా ఎకరాకు 1000 చొప్పున మునగ మొక్కలు పంపిణీ చేయడమే కాక ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించి మొక్కలు నాటిస్తున్నారు. అంతేకాక ఎరువులు, ఇతర అవసరాల కోసం ఎకరానికి రూ. లక్ష చొప్పున మంజూరు చేస్తోంది. దీంతో పలువురు ఈ పంట సాగుకు మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక కాయ ధర రూ.7 ఉండగా కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. అయితే ఈదురు గాలులతో మునగ తోటలకు పెను ప్రమాదం ఉన్నప్పటికీ నష్టాల నుంచి కూడా బయటపడే అవకాశం ఉంది. ఇక అంతర పంటలుగా బెండ, గోరుచిక్కుడు, వంగ, చిలకడ దుంప తదితర పంటలు సాగు చేస్తున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం, రైతుల వివరాలిలా..

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
టేకులపల్లి	50	54
జూలూరుపాడు	27	34
పాల్వంచ	20	28
గుండాల	24	24
కరకగూడెం	17	20
దుమ్ముగూడెం	23	18.5
చంద్రుగొండ	14	18
అశ్వారావుపేట	13	15
లక్ష్మీదేవిపల్లి	8	14
బూర్గంపాడు	14	13.5
సుజాతనగర్	11	12
ఆళ్లపల్లి	12	12

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



ప్రభుత్వ ప్రోత్సాహం బాగుండడంతో ఎకరంలో మునగ సాగు చేశాం. 5 నుంచి 6 నెలల్లోనే కాపు వచ్చింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ తోటను పరిశీలించి, నన్ను అభినందించడం ఎంతో సంతోషంగా ఉంది. మునగ కాయలు మార్కెట్‌కు తీసుకెళ్లకుండానే తోట వద్దకు వచ్చి వ్యాపారులు, ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. తోట వద్ద కిలో రూ. 40 నుంచి రూ. 50 చొప్పున అమ్ముతున్నాం.

– బానోత్ చోక్లీ, మాచినేనిపేట

కూరగాయల సాగు కూడా..



ఎకరంలో మునగ సాగు చేస్తున్నాం. అంతరపంటగా వంగ, బెండ, గనుసుగడ్డలు కూడా వేస్తున్నాం. వీటితో అదనపు ఆదాయం వస్తోంది. మునగ కాయలు ఒక్కో చెట్టుకు 150 నుంచి 300 కాయలు కాస్తున్నాయి. పత్తి, మిరప సాగుతో నష్టం వస్తుండగా అధికారుల ప్రోత్సాహంతో మునగ సాగు చేశాం.

– భూక్యా మంగ్యా, గాంధీనగర్

రైతులను ప్రోత్సహిస్తున్నాం



మునగ సాగు చేసేలా చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహిస్తున్నాం. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలతో ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాం. ఉపాధి పథకం ద్వారా రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడంతో పాటు ఎకరాకు రూ.లక్ష చొప్పున అందజేస్తున్నాం. 2024 – 2025లో జిల్లా వ్యాప్తంగా 403 ఎకరాల్లో ఈ పంట సాగు చేయగా ఈ ఏడాది 3 వేల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం

– బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

యూనిఫాం సిద్ధం

- 75 శాతానికి పైగా పూర్తయిన పనులు
- తయారీ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు
- పాఠ్య పుస్తకాలూ 89 శాతం వచ్చేశాయ్..
- పాఠశాలల ప్రారంభం రోజు అందజేయనున్న అధికారులు



యూనిఫాం తయారీని పరిశీలిస్తున్న డీఈఓ, అధికారులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 12 నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను సర్కారే అందించనుండగా.. ఇప్పటికే యూనిఫాం తయారీ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. జిల్లాలోని 1,332 ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు 29,850, బాలికలు 32,682 మంది.. మొత్తం 62,532 విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 2.56లక్షల మీటర్ల వస్త్రం అవసరం కాగా, ప్రస్తుతం ఒక జతకు సరిపడేలా 1.28 లక్షల మీటర్ల క్లాత్ చేరుకోగా, దాన్ని అన్ని మండలాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని పలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు దుస్తులు కుట్టే బాధ్యత అప్పగించారు. పాఠశాలల ప్రారంభం రోజున ఒక్కో విద్యార్థికి ఒక జత యూనిఫాం అందజేయనున్నారు. కొన్ని రోజుల తర్వాత మరో జత అందించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది జత యూనిఫాం కుట్టినందుకు మహిళా సంఘాల సభ్యులకు రూ.50 అందజేయగా.. ఈ సంవత్సరం రూ.75 చొప్పున చెల్లిస్తున్నారు. యూనిఫాం తయారీ పనులను పట్టణాల్లో మెప్మా, మండలాల్లో సెర్ప్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మండలాలకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు..

ఈ విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాలు అందించాలనే యోచనలో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. జిల్లాకు మొత్తం 5,08,400 పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,54,925 (89.4 శాతం) చేరుకున్నాయి. మిగిలిన పుస్తకాలు ఒకటి, రెండు రోజుల్లో వస్తాయని అధికారులు అంటున్నారు. జిల్లా గోదాంకు చేరిన పుస్తకాలను మండలాల వారీగా పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు చేరనున్నాయి.

విద్యార్థులకు మెరుగైన బోధన..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శిక్షణలో నేర్చుకున్న కొత్త అంశాలతో టీచర్లు బోధన చేసి చిన్నారుల్లో విద్యాబుద్ధులను మరింతగా మెరుగుపర్చనున్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా సర్కారు దశల వారీగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

ప్రారంభం రోజే అందజేస్తాం

జిల్లాకు ఇప్పటికే 89 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని గోదాంలో భద్రపరిచి అక్కడి నుంచి మండలాలకు పంపిణీ చేస్తున్నాం. ఇక యూనిఫాం తయారీ పనులు కూడా 75 శాతం వరకు పూర్తయ్యాయి. మిగితా పనులు కూడా రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు ప్రారంభమయ్యే ఈనెల 12న విద్యార్థులందరికీ పుస్తకాలు, ఒక జత యూనిఫాం అందజేస్తాం.

– ఎం.వెంకటేశ్వరా చారి, డీఈఓ

ప్రగతి మైదానంలో వేడుకలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తారని వివరించారు.

కిన్నెరసానికి పోటెత్తిన పర్యాటకులు

ఒకరోజు ఆదాయం రూ.62,610



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 703 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.37,370, 400 మంది బోటు షికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.25,240 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆస్తుల కన్నా.. పర్యావరణం మిన్న

- వన మహోత్సవంలో సింగరేణి సీఎండీ
- 121 మొక్కలు నాటిన బలరామ్



నాటిన మొక్క వద్ద సీఎండీ బలరామ్, పక్కన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచంలో అన్నింటికీ హద్దులు ఉన్నా.. గాలి, వెలుతురు, ఆక్సిజన్‌కు లేవని, ఎవరైనా కుటుంబసభ్యులకు ఇళ్లు, స్థలాలు, బంగారు ఆభరణాలు ఇస్తుంటారని, వాటన్నింటి కంటే పర్యావరణం ముఖ్యమని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీ డంప్‌యార్డ్ వద్ద ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 121 మొక్కలు నాటారు. దీంతో తాను ఇప్పటివరకు 19,121 మొక్కలు నాటానని, వచ్చే జూలై చివరి నాటికి మరో 1,879 మొక్కలు నాటి.. 21వేల లక్ష్యాన్ని చేరాల్సి ఉందని వివరించారు. ఒక మొక్క ద్వారా రూ. కోటి విలువైన ఆక్సిజన్ ఉచితంగా పొందవచ్చన్నారు. భావితరాలకు అదే మన మిచ్చే ఆస్తి అని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది సింగరేణి ఆధ్వర్యంలో 40 లక్షల మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. అనంతరం చెరువు పక్కన కాసేపు ధ్యానం చేశారు. కార్యక్రమంలో ఏరియా జీఎం శాలేంరాజు, డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, అటవీ, పర్యావరణ శాఖ సలహాదారు మోహన్ చంద్ర పరిగెన్, పర్యావరణ జీఎం సైదులు, జీకేఓసీ పీఓ రమేష్, సూర్యనారాయణ, ఎండీ రజాక్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భక్తులతో పోటెత్తిన భద్రగిరి



రామయ్య దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకుంటుండడం, ఆదివారం కావడంతో భద్రగిరి భక్తులతో పోటెత్తింది. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన పిదప స్వామి దర్శనానికి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థాన ప్రాంగణం సందడిగా మారింది.

నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమ, మంగళవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం ఖమ్మం గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి ప్రసంగిస్తారు. ఆతర్వాత చింతకానిలో రోడ్డు విస్తరణ పనులకు, సాయంత్రం మధిర మండలం మాటూరులో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, మంగళవారం ఉదయం ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భూభారతి సదస్సులో డిప్యూటీ సీఎం పాల్గొంటారు.

రేపటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే ఈ పరీక్షలకు 1,367 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కొత్తగూడెం సింగరేణి హై స్కూల్, పాల్వంచ జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ఇల్లెందులోని సింగరేణి పాఠశాల, మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, భద్రాచలంలోని ఎస్ఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 9989027943 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్..

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతాయని నోడల్ అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని వివరించారు. ఫీజు చెల్లించిన విద్యార్థులు వారి కళాశాల లాగిన్‌లో హాల్ టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రోహిణి కార్తె ప్రతాపం

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు



మండుటెండలో పత్తిగింజలు వేస్తున్న కూలీలు

బూర్గంపాడు: ఉపరితల ఆవర్తనంతో శనివారం వరకు చల్లగా ఉన్న వాతావరణం ఆదివారం ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోహిణి కార్తె ఎండ తీవ్రత జిల్లా వ్యాప్తంగా కనిపించింది. శుక్రవారం వరకు ఆడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. రుతుపవనాలు కూడా విస్తరిస్తున్నాయనే వాతావరణ సూచనలతో కొందరు రైతులు పత్తిగింజలు వేయటం కూడా మొదలు పెట్టారు. ఆదివారం ఎండ తీవ్రతకు పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు మధ్యాహ్నానికే ఇంటిదారి పట్టారు. కొందరు రైతులు వేసిన పత్తిగింజలు మొలకలు తిరిగి ఎండిపోతున్నాయి. పత్తిగింజలు వేసేందుకు సిద్ధమైన కొందరు రైతులు ఎండల తీవ్రతకు వెనుకడుగు వేస్తున్నారు.

సింగరేణి అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): వివిధ ఏరియాల్లోని ఐఈడీ విభాగంలో పనిచేస్తున్న ఏడుగురు అధికారులను బదిలీచేస్తూ ఆదివారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. మణుగూరు ఏరియా ఏజీఎం కె.వెంకట్రావును కార్పొరేట్ హెచ్ఓడీగా, కార్పొరేట్‌లో హెచ్ఓడీగా పనిచేస్తున్న సీహెచ్ సీతారాంబాబును మణుగూరుకు, మందమర్రి ఏరియా డీవైజీఎం పి.రాజన్నను శ్రీరాంపూర్‌కు, భూపాలపల్లి డీవైజీఎంగా ఏ.వసంతరావును కార్పొరేట్ హెచ్ఓడీగా, శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఈ కె.కిరణ్ కుమార్‌ను మందమర్రికి, కార్పొరేట్ ఏరియా సీపీపీ ఎస్ఈ ఎం.మనోజ్‌కుమార్‌ను ఈఆర్‌పీ వింగ్‌కు, మణుగూరు ఎస్ఈ ఎం.శ్రీనివాసులును కార్పొరేట్ సీపీపీ విభాగానికి బదిలీ చేశారు. వీరందరూ ఈ నెల 11వ తేదీ తేదీలోగా కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని సూచించింది.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



వివిధ పతకాలతో విద్యార్థులు

గుండాల: జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో గుండాల మండలం నుంచి 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరుగురు స్వర్ణ, ఆరుగురు రజత, మరో 11 మంది కాంస్య పతకాలను అందుకున్నారని కోచ్ సుధాకర్ తెలిపారు. విజేతలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పోలీసు బలగాలను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో మావోయిస్టులు ఏర్పాటు చేసిన 10 శక్తిమంతమైన మందుపాతరలను ఆదివారం భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. ఈ ఘటన కోహిమెట్టా పోలీస్ స్టేషన్ పరిధి కుతుల్ సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలోని కొడ్బార్–గుర్బా గ్రామాల అటవీ ప్రాంతంలో జరిగింది. మందుపాతరలను నిర్వీర్యం చేయడంతో పోలీసు బలగాలకు పెను ప్రమాదం తప్పింది. కాగా ఆ ప్రాంతంలో మరిన్ని మందుపాతరలు ఉన్నాయనే అనుమానంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

- మొదటి సంవత్సరంలో కొనసాగుతున్న అడ్మిషన్లు
- ఇంకా ప్రభుత్వ కళాశాలలకు చేరని పాఠ్యపుస్తకాలు
- మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని విన్నపం



కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ కళాశాలలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే కళాశాలలను శుభ్రం చేసి, సిద్ధం చేశామని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి తెలిపారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. కాగా కళాశాలలు ప్రారంభమవుతున్నా పాఠ్య పుస్తకాలు ఇంతవరకు కళాశాలలకు చేరుకోలేదు. ఏటా కళాశాలల ప్రారంభం తర్వాతే అరకొరగా పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు సీనియర్ల పుస్తకాలు అడిగి చదువుకుంటున్నారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు కాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి కళాశాలలకు వస్తున్న విద్యార్థుల కోసం మధ్యాహ్నభోజన పథకం అమలు చేయాలని ఎన్నో ఏళ్లుగా తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు విన్నవించారు. జిల్లాలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలు 14, ప్రైవేటు కళాశాలలు 30 ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో 2,900 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, రెగ్యులర్ లెక్చరర్లు 160, కాంట్రాక్టు లెక్చరర్లు 11, గెస్ట్ లెక్చరర్లు 27, నాన్ టీచింగ్ స్టాఫ్ 65 మంది ఉన్నారు. కాగా ప్రభుత్వ కళాశాలల్లో గతంలో గెస్ట్ లెక్చరర్లుగా పని చేసిన వారిని, లెక్చరర్ల సంఖ్య తక్కువ ఉన్న చోట మళ్లీ తీసుకోవచ్చని రీజినల్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది లెక్చరర్ల కొరత ఉండదని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందాలని ఇంటర్మీడియట్ అధికారులు కోరుతున్నారు.

అడ్మిషన్లు పొందాలి



జిల్లాలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలి. నేటి నుంచి కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కళాశాలలను ఇప్పటికే సిద్ధం చేశాం. పాఠ్య పుస్తకాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

–హెచ్.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి. సుదూరప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులు అవస్థ పడుతున్నారు. ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు వినతిపత్రం కూడా అందించాం.

–ఎం.ఖుర్షీద్ అహ్మద్, లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఏదీ కారుణ్యం?

- జెన్‌కోలో కారుణ్య నియామకాల్లో తీవ్ర జాప్యం
- మూడేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూపులు
- కేటీపీఎస్‌లో సుమారు 76 మంది బాధితులు



కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. కర్మాగారాల్లో నిత్యం కాలుష్యం అధికంగా ఉండే రెడ్‌జోన్ పరిధిలో కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో అనేక ప్రాణాంతక వ్యాధులకు గురై అనారోగ్యంతో బాధపడుతుంటారు. వ్యాధులు, ప్రమాదాలతోపాటు అకాల మరణాలు చెందిన అనేక మంది ఉద్యోగుల కుటుంబాలకు దక్కాల్సిన కారుణ్య నియామకాలపై జెన్‌కో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా తాత్సారం చేస్తోంది. జెన్‌కో వ్యాప్తంగా సుమారు 110 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తుండగా, కేవలం కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలోనే సుమారు 76 మంది వరకు ఉన్నట్లు కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

బాధితుల ఎదురుచూపులు

ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థల్లో జాప్యం లేకుండా కారుణ్య నియామకాలు చేపడుతున్నారు. జెన్‌కోలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సీఎండీలు మారడం, డైరెక్టర్‌స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటం, ప్రభుత్వం మారడం వంటి పరిణామాలతో మూడేళ్లుగా ఈ ప్రక్రియ మందగించింది. దీంతో విధుల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న బాధిత కుటుంబీకులు మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగాలు ఇప్పించేందుకు పైరవీల పేరుతో బాధితుల నుంచి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాలు వెంటనే ఇస్తే ఎక్కువ కాలం విధులు నిర్వర్తించే చేసే అవకాశం, సీనియారిటీ పెరిగి అధిక వేతనం వచ్చే అవకాశం ఉంటుంది. కానీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల నష్టపోతున్నట్లు పలువురు వాపోతున్నారు.

వర్తించని జీపీఎఫ్

1999 నుంచి 2004 మధ్యలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తించడం లేదు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చి పెన్షన్ ఇవ్వాలని ఉద్యోగాలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమస్యపై కూడా ఉద్యోగ సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. అయినా సమస్య పరిష్కారం కావడంలేదు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, కారుణ్య నియామకాల కోసం, జీపీఎఫ్ కోసం తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాడ్ చేస్తున్నాయి.

రూ.5 కోట్ల పనులు..

ఆనవాళ్లు కరువు



ఆనకట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు (ఇన్‌సెట్) ప్యానెల్ ఎత్తుకుపోవడంతో మిగిలిన లైట్

- **వైరా రిజర్వాయర్ ఆనకట్టకు పగుళ్లు**
- ట్యాంక్‌బండ్ పనుల్లోనూ అదే పరిస్థితి
- ఆసక్తిగా వచ్చే స్థానికులు, పర్యాటకులకు నిరాశ

వైరా: వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన వైరా రిజర్వాయర్ ఆనకట్ట రూపురేఖలు కోల్పోతోంది. నైజాం కాలం నిర్మించిన ఈ రిజర్వాయర్‌కు జిల్లాలోనే ప్రాధాన్యత ఉంది. కానీ అటు అధికారుల, ఇటు పాలకుల పట్టింపులేని తనంతో ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వైరా రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధికి 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.30 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 2.5 మీటర్లు ఉన్న ఆనకట్టను 8మీటర్లుగా వెడల్పు చేయడంతో పాటు బతుకమ్మ ఘాట్, 2.5 కి.మీ. మేర ఆనకట్టపై రెయిలింగ్ ఏర్పాటుచేసి, లాన్ తీర్చిదిద్దారు. అంతేకాక కట్ట పొడవున సోలార్ లైట్లు ఏర్పాటు చేయగా.. ఇప్పుడు అవేమీ కానరావడం లేదు. అటు రిజర్వాయర్, ఇటు మినీ ట్యాంకు బండ్‌గా పేరున్నా సేద తీరాలని వచ్చే వారికి అసౌకర్యాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయి.

దెబ్బతిన్న రెయిలింగ్

రిజర్వాయర్ ఆనకట్టను సుమారు వందేళ్ల క్రితం నిర్మించినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ 2019 సంవత్సరంలో చేపట్టిన పనులు ఐదేళ్లు దాటక ముందే నాణ్యతాలోపంతో దెబ్బతింటున్నాయి. ఇప్పటికే అర కిలో మీటర్‌కు పైగా ఆనకట్టుకు రెయిలింగ్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇదిలాగే వదిలేస్తే ప్రమాదకర స్థాయికి చేరే అవకాశముంది. ఇక ఆనకట్టపై రూ.20లక్షలు వెచ్చించి పచ్చటి గడ్డితో తీర్చిదిద్దిన లాన్ సైతం ఆనవాళ్లు కోల్పోయి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది.

కానరాని సోలార్ లైట్లు, ప్యానళ్లు

రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా నిర్వహణ లోపంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్ల క్రితం రూ. 35 లక్షలతో 2.5 కి.మీ. పొడవులో 73 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. కానీ చాలా వాటి బ్యాటరీలు, ప్యానెళ్లు, లైట్లు చోరీ కావడంతో ఇప్పుడు పదికి మించి లైట్లు వెలగడం లేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకున్న అధికారులు కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో సాయంత్రం వేళ ఆనకట్టపైకి వచ్చే పర్యాటకులు, వాకర్లు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయాన ఆకతాయిల తీరుతో మహిళలకు అవస్థ ఎదురవుతోంది. అంతేకాక బతుకమ్మ ఘాట్ మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం వేళ ఇక్కడ మద్యం సేవిస్తున్న పలువురు బాటిళ్లు పగుల గొట్టి వదిలేస్తుండడం గమనార్హం.

పర్యవేక్షణ లోపంతోనే..

రిజర్వాయర్ ఆనకట్ట పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందినా అటు నీటి పారుదల శాఖ, మున్సిపల్, పర్యాటక శాఖ అధికారులెవరూ పట్టించుకోకపోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లోపంతో ఆనవాళ్లు కోల్పోతుంది. సాయంత్రమైనా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తే ఆకతాయిలకు అడ్డుకట్ట పడుతుంది. అలాగే, రెయిలింగ్ పగుళ్ల వద్ద మరమ్మతులు చేసి, పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా తీర్చిదిద్దాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

మరమ్మతులు చేపడతాం..

రిజర్వాయర్ ఆనకట్ట రెయిలింగ్‌కు పగుళ్లు వచ్చిన చోట మరమ్మతు చేయిస్తాం. అలాగే, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పిచ్చి మొక్కలు తీయించడమే కాక పూల మొక్కలునాటుతాం. ఆనకట్టను మరింత అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తాం.

– శ్రీనివాస్, ఐబీ, డీఈ, వైరా

తగ్గిన ఆయిల్‌పామ్ ధర

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ గెలల ధర మరోసారి తగ్గింది. గత నెలలో స్వల్పంగా తగ్గిన ధర, తాజాగా టన్నుకు ఏకంగా రూ.1,310 కు దిగజారింది. ఆదివారం ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ధర నిర్ణయించారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం తాజాగా టన్ను ధరను రూ.18,748గా ప్రకటించినట్లు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

అధ్యాపకుల నిరసన

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని నూతన అధ్యాపకులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ విషయంలో కొందరు కుట్ర పన్నారని పేర్కొంటూ అధ్యాపకులు నిరసన తెలిపారు. ఖమ్మంలోని నయాబజార్ జూనియర్ కళాశాలలో వాల్యుయేషన్ కేంద్రం వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు సురేష్, బేగం, మల్లయ్య, కిషోర్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజు

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: తల్లిదండ్రులు తమ పిల్లలను మన ఊరి ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి నాణ్యమైన ఉచిత విద్యను పొందాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు కోరారు. ఆదివారం అశ్వారావుపేట, ములకపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో విద్యావంతులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలతోపాటు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్కులు, యూనిఫాంలు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, రాగి జావ, కోడి గుడ్లు అందిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు వి.వరలక్ష్మి, జిల్లా కార్యదర్శి కృష్ణారావు, నాయకులు ఎం.రాజేశ్వరరావు, ఎస్.కొండలరావు, హరినాథ్ బాబు, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.సురేష్, గరికె శ్రీనివాస్, కిషోర్, కే. శ్రీరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫౌండేషన్ విత్తనాల పంపిణీ



డాక్టర్ వి.లక్ష్మీ నారాయణమ్మ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని 23 మండలాల్లో ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు చొప్పున రైతులను ఎంపిక చేసి సోమవారం నుంచి వరి, పెసర ఫౌండేషన్ సీడ్ (పునాది విత్తనం) పంపిణీ చేయనున్నట్లు కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీ నారాయణమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె వివరాలు వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

‘ఈ దేశ మూలవాసులం మనమే..’



మాట్లాడుతున్న శ్రీధర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలే కాక మతం మార్చుకున్న ముస్లిం మైనార్టీలు కూడా ఈ దేశ మూలవాసులేనన్న అంశం శాస్త్రీయంగా నిరూపితమైందని బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా శ్రీధర్ తెలిపారు. సంఖ్యాపరంగా అధిక సంఖ్యలోనే ఉన్నా బానిసలుగా, బాధితులుగా మిగిలిపోవడంతో విద్య నుండి దూరమయ్యామని చెప్పారు. ఖమ్మం టీటీడీసీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇతర దేశాల నుండి వలస వచ్చిన ఆర్యులు ఇక్కడి జీవన విధానం, నాగరికతను ధ్వంసం చేసి ఎవరూ తిరగబడకుండా కుల వ్యవస్థ, మనుధర్మాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అందరూ చరిత్రను చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయకుమారి మాట్లాడుతూ స్త్రీలకు విలువలు లేని మనుధర్మ శాస్త్రం, కులాన్ని రుద్దడం ద్వారా రాజ్యాధికారానికి దూరం చేశారని తెలిపారు. తొలుత సామాజిక ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు కొండా పెద్దన్న, భూక్యా ఉపేంద్ర బాయి, షేక్ నజీమా, ప్రమీల, త్రివేణి, భవాని, సరోజని, బానోతు భద్రునాయక్, మీగడ రామారావు, రవి, సోమ్లా, సంజీవరావు, పి.నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

అన్యమత ప్రచార కవర్‌లో రామయ్య శేష వస్త్రాలు

- భద్రాచలంలో భక్తుడు ఫిర్యాదు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారి శేష వస్త్రాల విక్రయ శాల నిర్వాహకులపై ఓ భక్తుడు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏపీలోని గుంటూరుకు చెందిన మేళ్లచరువు జనార్దనరావు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం కౌంటర్ వద్ద శేష వస్త్రాలను కొనుగోలు చేశారు. అయితే ఆ వస్త్రాలు అందించిన కవర్‌పై అన్యమత ప్రచారానికి సంబంధించిన వ్యాఖ్యలు ఉన్నాయేంటని భక్తుడు వారిని ప్రశ్నించాడు. దీనిపై సదరు కాంట్రాక్టర్ సిబ్బంది సంతృప్తికర సమాధానం చెప్పకపోవడంతో ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈఓ సదరు కాంట్రాక్టర్‌కు నోటీస్ జారీ చేశారు. కాగా, కర్నూల్‌కు చెందిన ఓ వస్త్ర దుకాణ యాజమాన్యం ఈ కవర్లను ఉచితంగా అందజేసినట్లు తెలుస్తోంది. ఆలయ ప్రాంగణంలోనే అన్యమత ప్రచారం జరుగుతున్నప్పటికీ గుర్తించని అధికారుల పర్యవేక్షణ లోపంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

పాల్వంచ: వ్యక్తి ఆత్మహత్యపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన సిరిపురపు పాపారావు(32) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా కడుపు నొప్పి సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం తీవ్రమైన నొప్పి రావడంతో మద్యంలో గడ్డి మందు కలుపుకుని తాగాడు. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

దమ్మపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా వేంసూరు మండలం అడవి రామన్నపాలెం గ్రామానికి చెందిన ఈలప్రోలు గణపతి, ప్రభావతి(38) దంపతులు శనివారం బైక్‌పై దమ్మపేట మండలంలోని నాయుడుపేట గ్రామానికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా రాష్ట్రీయ రహదారిపై గున్నేపల్లి గ్రామ శివారులో వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం తరలించి చికిత్స అందిస్తుండగా, శనివారం రాత్రి ప్రభావతి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుమ్ముగూడెం : మండలంలోని ఆంధ్రకేసరి నగర్ కాలనీలో భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రోడ్డు వెంబడి వెళ్తున్న ప్రజలు మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనా స్థలాన్ని సీఐ అశోక్, ఎస్‌ఐ గణేష్ సందర్శించారు. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు.

చోరీ ఘటనలో కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీలో చోరీ జరిగింది. బస్తీకి చెందిన ఆంగోతు రమేష్ గత నెల 21న బంధువుల ఇంటికి వెళ్లి 31న రాత్రి తిరిగి వచ్చాడు. ఇంట్లో పరిశీలించగా అరతులం బంగారం, రూ. 10 వేలు నగదు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాద ఘటనలో..

రోడ్డు ప్రమాద ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన వృద్ధుడు బొల్లెం ఉప్పలయ్య మూడు రోజుల క్రితం నడుచుకుంటూ వెళ్తుండగా సీతారామా టాకీస్ సమీపంలో ఓ వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టి పారిపోయాడు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్‌ఐ బి.సూర్య కేసు నమోదు చేశారు.

డబ్బులు అడిగితే దాడి చేశారని..

తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు గుగులోత్ సీత్ అనే వ్యక్తి హతమారుస్తానని బెదిరించాడని, దాడి చేశాడని గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియాకు చెందిన బానోతు బుజ్జి అనే మహిళ ఆదివారం ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.